




చూడచక్కని మొక్కలు

రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని చివరి సంవత్సరం విద్యార్థులు వారి లర్నింగ్ ప్రోగ్రాంలో భాగంగా నర్సరీలను పెంచుతున్నారు. వివిధ రకాల పువ్వుల మొక్కలు, పండ్ల మొక్కలతో పాటు ఇండోర్, అవుడోర్ మొక్కలను ఈ నర్సరీల్లో పెంచుతున్నారు. విద్యార్థుల విశ్వవిద్యాలయంలో సేంద్రీయ ఎరువులను తయారు చేసుకుని సుమారు 30 రకాల మొక్కలను నర్సరీలలో పెంచుతున్నారు. ఈ మొక్కలను కుండీల్లో పెట్టి అవసరం ఉన్న వారికి పంపిణీ చేస్తున్నారు. ఇండ్లలోని ఇండోర్, అవుట్‌డోర్ మొక్కలతో పాటు పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాల్లో అధికారులకు పంపిణీ చేయడానికి తయారు చేస్తున్నారు. – ఏజీవర్సిటీ

పోదామా... వద్దా!

- కాంగ్రెస్‌లో చేరికపై ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సమాలోచనలు
- భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన ముఖ్య నేతలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరికపై శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నియోజకవర్గం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సన్నిహితులతో సమాలోచనలు నిర్వహించారు. కొందరు పార్టీ మారవద్దని సూచించగా..మరికొందరు మంత్రి పదవి ఇస్తేనే పార్టీలోకి వెళ్లాలని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఉదయం శంషాబాద్ మండలానికి చెందిన వారితో సమావేశమైన అనంతరం రాజేంద్రనగర్ సర్కిల్ గండిపేట్ మండల ముఖ్య నాయకులతో వేర్వేరుగా సమావేశమై అభిప్రాయాలను స్వీకరించారు. మెజార్టీ నేతల అభిప్రాయం నేతల అనుగుణంగా తాను నడుచుకుంటానని స్పష్టం చేశారు. ప్రస్తుతం పార్టీలోకి చేరుదామా..? లేదా అన్నది రెండు రోజుల్లో స్పష్టత రానుంది. ముఖ్య అనుచరులు మాత్రం పార్టీలో చేరేందుకే ఎమ్మెల్యేకు సూచించినట్లు తెలుస్తుంది. మరో రెండు రోజులు గడిస్తే కానీ పార్టీలో చేరుతారా లేదా అన్నది తేలనుంది. కాగా కాంగ్రెస్ పార్టీలో చేరిక విషయమై ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ శనివారం మధ్యాహ్నం విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం తాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశానని నియోజకవర్గ సమస్యలను వివరించినట్లు తెలిపారు. పార్టీలోకి ఆహ్వానించారని, తాను నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలందరితో కలిసి సమావేశమై అభిప్రాయాన్ని తెలుపుతానని వెల్లడించానన్నారు. కాగా శనివారం రాత్రి బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కలిశారు.

మోదీపైనే దేశ ప్రజలందరికీ విశ్వాసం



బీజేపీ కరపత్రాలను అందజేస్తున్న ఎంపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి

బీజేపీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మణికొండ: దేశాన్నిఅన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పైనే దేశ ప్రజలందరికీ విశ్వాసం ఉందని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేటలోని రాజపుష్ప అట్రియా గేటెడ్ కమ్యూనిటీవాసులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా రోడ్లు, పోర్టులు, రక్షణరంగం అభివృద్ధి, ఎయిర్ పోర్టుల నిర్మాణం, అనేక అంతర్జాతీయ సంస్థలను ఆహ్వానించటం లాంటి ఎన్నో చర్యలను గత దశాబ్దకాలంలో కేంద్ర ప్రభుత్వం కృషి చేసిందన్నారు. రాబోయే ఐదేళ్లల్లో అనేక దేశాలకు వెనక్కి తోసి మన దేశం మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉందన్నారు. సామన్యులు సైతం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులు పెట్టే అవకాశాన్ని కల్పించారన్నారు.

కాంగ్రెస్ పార్టీకి సిద్ధాంతాలు లేవు..

కాంగ్రెస్ పార్టీకి సిద్ధాంతాలు లేకుండా పోతున్నాయని, వాటిల్లో అనేక వైరుధ్యాలు ఉన్నాయని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. దేశంలో కామన్ సివిల్ కోడ్, అయోధ్య రామమందిర నిర్మాణం, ట్రిపుల్ తలాక్, కాశ్మీర్ వివాదంలో ఆ పార్టీలోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయన్నారు. బీజేపీపై వారు చేసే తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని, దేశాభివృద్ధికి బీజేపీకే ఓటు వేయాలని కోరారు. ఈ సమావేశంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాజేంద్రనగర్ పార్టీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి, కోకాపేట కార్పొరేటర్ ఆర్. ఆదిత్యరెడ్డి, పార్టీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ప్రదీప్, గేటెడ్ కమ్యూనిటీ అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

నేడు మాంసాహార షాపులు బంద్

మణికొండ: మహావీర్ జయంతి సందర్భంగా ఆదివారం నార్సింగి, మణికొండ మున్సిపాలిటీ పరిధిలలో మటన్, చికెన్, చేపల మార్కెట్‌లు మూసి ఉంచాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని మున్సిపల్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డీ. ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఎవరైనా అలాంటి షాపులను తెరిస్తే తమ మున్సిపల్ సిబ్బంది జరిమానాలను విధించటంతో పాటు మూసి వేస్తామన్నారు.

నేడు చెరువుల క్లీనింగ్

మణికొండ: చెరువుల చుట్టు పక్కల పేరుకు పోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వస్తువులను తొలగించే కార్యక్రమాన్ని ఆదివారం మూడు చెరువుల వద్ద నిర్వహిస్తున్నట్టు ధృవాన్ష్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు మధులిక చౌదరి తెలిపారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ చెరువు, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ముష్కి చెరువు, గచిబౌలి లోని బర్లకుంట చెరువుల వద్ద వలంటీర్ల సహాయంతో ఏకకాలంలో పనులు చేపడుతున్నామన్నారు. ఉదయం 7.30 గంటల నుంచి 9.30గంటల వరకు ఈ క్లీనింగ్ కొనసాగుతుందని, ఉత్సాహ వంతులు వచ్చి కార్యక్రమంలో పాల్గొనవచ్చని ఆమె కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎంఐఎం నేత



శంషాబాద్: శంషాబాద్‌కు చెందిన ఎంఐఎం నేత మహ్మద్ ఫసియుద్దీన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలుగులో ఉన్న ఖురాన్ గ్రంథాన్ని ఆయన అందజేశారు. మైనార్టీలకు ఎల్లవేళలా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఫసియుద్దీన్‌తో పాటు కొందరు నేతలు ఈ సందర్భంగా పార్టీలో చేరారు.

మూడో రోజు ఆరు నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థి

రాజేంద్రనగర్: పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గానికి మూడో రోజు శనివారం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. మహ్మద్ సలీం రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యూలర్) పార్టీ అభ్యర్థి (1) సెట్, స్వతంత్ర అభ్యర్థిగా (1) సెట్ నామినేషన్ సమర్పించారని రిటర్నింగ్ అధికారులు తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా ఇసరి సూర్య ప్రకాశ్‌రెడ్డి, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా తోట్ల రాఘవేందర్, స్వతంత్ర అభ్యర్థిగా ఆంజనేయులు నీరటి, ప్రజా వెలుగు పార్టీ అభ్యర్థిగా టి.దురాగ ప్రసాద్ ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ వేశారని వివరించారు. కాగా ఇప్పటి వరకు మొత్తం పదకొండు మంది అభ్యర్థులు పన్నెండు నామినేషన్లు దాఖలు చేశారని జిల్లా ఎన్నికల అధికారి శశాంక తెలిపారు.

నేరాలను అరికట్టండి



సీఐ హరికృష్ణారెడ్డికి వినతిపత్రం ఇచ్చిన అలకాపూర్ టౌన్‌షిప్ నాయకులు

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్‌లో రాత్రి సమయంలో దొంగతనాలు, దారి దోపిడీలు, హిజ్రాల వేధింపులు ఎక్కువవుతున్నాయని, వాటిని నివారించేందుకు పోలీస్ గస్తీని పెంచాలని సంక్షేమ సంఘం నాయకులు నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిని కోరారు. శనివారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాసు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ మధ్య కాలంలో టౌన్‌షిప్‌లో అనేక వ్యాపార సంస్థలు పెడుతున్నారని, అవి అర్ధరాత్రి వరకు కొనసాగుతున్నాయన్నారు. వాటికి వచ్చే స్థానికేతరులు టౌన్‌షిప్ వాసులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. అలాంటి షాపులను సకాలంలో మూసుకునేలా ఆదేశాలు జారీ చేయటంతో పాటు దొంగతనాలను నివారించేందుకు అవసరమైన గస్తీ పెంచాలని సీఐని కోరామన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



మున్సిపల్ కార్మికులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న నరేందర్‌బాబు

బండ్లగూడ: మున్సిపల్ కార్మికుల సేవలను గుర్తించడంతో పాటు వారికి తమవంతు సాయంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశామని నరేందర్‌బాబు అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ అభ్యుదయనగర్ కాలనీ కమ్యూనిటీహాల్ ప్రాంతంలో వృద్ధి అసోసియేట్స్ వారితో ప్రభుత్వం సబ్సిడీ రేట్లకు అందించే పలు రకాల నిత్యావసర సరుకుల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుద్ధ్యం, వాటర్ లైన్‌మెన్, సిబ్బందికి ఉచితంగా గోధుమ పిండి, పచ్చళ్లను వారు చేసే పనికై కృతజ్ఞతగా సొంత ఖర్చుతో పంపిణీ చేశారు. అనంతరం నరేందర్‌బాబు మాట్లాడుతూ.. బియ్యం, చనగపప్పు, గోధుమ పిండి, పలు రకాల పచ్చళ్ల ప్రజలకు ప్రభుత్వం ద్వారా సబ్సిడీ రేట్లకే లభిస్తాయన్నారు. వృద్ధి అసోసియేట్స్ వారి షాపు బండ్లగూడ జాగీరులోగల టైమ్స్ స్కూల్ ఆవరణలో ఉందన్నారు. ప్రజలు రాయితీ రెట్లకు నిత్యావసర సరుకులు కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవీన్, కాలనీ వాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీయాగం



చండీయాగంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: బుద్వేల్ కోట మైసమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సందర్భంగా శనివారం చండీయాగం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఈ యాగాన్ని ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించారు. స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ యాగంలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుండే ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేవాలయానికి వస్తున్న భక్తులకు ఇబ్బంది కలుగకుండా నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థుల తల్లిదండ్రులు పడే కష్టాన్ని వృథా చేయకుండా చదవాలని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ సూచించారు. శనివారం బండ్లగూడలోని మహవీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాలలో చదివే 24 మంది విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను ప్రదానం చేశారు. కళాశాల సెక్రటరి సంరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కళాశాలలో ఇక నుంచి అటోనోమస్‌గా మారి జేఎన్‌టీయూ గుర్తింపుతో విద్యార్థులకు నాణ్యామైన విద్యను అన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషాశ్రీ,సంయుక్త కార్యదర్శి సంరెడ్డి ధనసుంజయ్‌రెడ్డి, చైర్మన్ జయలక్ష్మి పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో సీబీఐటీలో హ్యాకథాన్



పోస్టర్‌ను విడుదల చేసిన ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో ఈనెల 26, 27 తేదీల్లో జాతీయ స్థాయి హ్యాక్‌ఎక్స్‌లేరేట్-2024 నిర్వహిస్తున్నట్టు అకాడమీ డైరెక్టర్ ఎం. సుశాంత్ బాబు తెలిపారు. హ్యాకథాన్‌కు సంబంధించిన పోస్టర్‌ను శనివారం కళాశాలలో విడుదల చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. హ్యాకథాన్‌లో మైక్రోసాఫ్ట్‌వేర్ స్పాన్సర్ చేస్తుండగా దేశ వ్యాప్తంగా 115 టీములు రిజిష్టర్ చేసుకున్నాయన్నారు.

వాటర్ ప్లాంట్ సీజ్



ప్లాంట్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని ప్రాంతంలో అక్రమంగా నీటి సరఫరా చేస్తున్న వాటర్ ప్లాంట్‌ను తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది సీజ్ చేశారు. అక్రమంగా నీటి సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ తహసీల్దార్ బొమ్మ రాములు హెచ్చరించారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈద్ మిలాప్



ఈద్ మిలాప్‌లో పాల్గొన్న ముస్లిం మత పెద్దలు, అధికారులు

ఏజీవర్సిటీ: సర్వమతాలవారు కలిసిమెలసి ఉన్నప్పుడే సంస్థలు, సమాజం ప్రశాంతంగా ఉంటుందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వెంకటరమణ అభిప్రాయపడ్డారు. రంజాన్ పండుగని పురస్కరించుకుని విశ్వవిద్యాలయంలో శనివారం ఈద్ మిలాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..అన్ని మతాల వారు తమ పండగలను ప్రశాంతంగా నిర్వహించుకునే వాతావరణం దేశంలో తరతరాలుగా ఉందన్నారు. దీన్ని భవిష్యత్తులోనూ కొనసాగించుకోవాలని సూచించారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపి షీర్ ఖుర్మా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, విశ్వవిద్యాలయం అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పుష్కరిణిలో వ్యక్తి గల్లంతు

- రోజంతా వెతికినా దొరకని ఆచూకీ
- గల్లంతైన వ్యక్తి ఏపీలోని ప్రకాశం జిల్లా వాసి



లక్ష్మీవేంకటేశ్వరస్వామి పుష్కరిణిలో గాలిస్తున్న గజ ఈతగాళ్లు



రవి(ఫైల్)

చేవెళ్ల: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి పుష్కరిణిలో స్నానానికి వెళ్లిన ఓ తాపీ మేస్త్రీ నీట మునిగి గల్లంతయ్యాడు. ఈ ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. శనివారం గజ ఈతగాళ్లు రోజంతా వెతికినా మృతదేహం లభించలేదు. వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా సొంతరావు గ్రామానికి చెందిన తానే రవి(38) ఇరవై ఏళ్ల క్రితం రాజేంద్రనగర్ మండలం బంగ్లగూడ ప్రాంతంలోని కాళీమందిర్ వద్ద నివాసం ఉంటూ.. తాపీ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల షాబాద్ మండలంలోని ఏట్లఎర్రవల్లి గ్రామంలో ఓ ఇల్లు కట్టేందుకు పనిని గుత్తకు తీసుకున్నాడు. శుక్రవారం పనికి వచ్చిన ఆయన సాయంత్రం చేవెళ్లకు చేరుకున్నాడు. ఆయనతో పాటు మరో ఇద్దరు తెలిసిన వ్యక్తులు ఉండటంతో ముగ్గురు కలిసి చేవెళ్లలోని వేంకటేశ్వర స్వామి వారి పుష్కరిణి(గుండం)లోకి స్నానానికి వెళ్లారు. మద్యం సేవించిన వారు ఇద్దరు ఒడ్డున స్నానం చేస్తుండగా రవి గుండం మధ్యకు ఈదుకుంటూ వెళ్లి ఆయాసం రావడంతో నీట మునిగాడు. ఒడ్డున ఇద్దరు వ్యక్తులు అతన్ని కాపాడేందుకు విఫలయత్నం చేశారు. వారు వెంటనే చేవెళ్ల పోలీసులకు సమాచారం అందించారు. నీటిలో మునిగిపోవటంతో పోలీసులకు జాడ కనిపించలేదు. ఈత వచ్చిన వారితో గాలించినా ఫలితం లభించలేదు. శనివారం ఉదయం గుండంలో మళ్లీ గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరక్క సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐ వీరబ్రహ్మం గజ ఈతగాళ్లను పిలిపించి వెతికించారు. గుండలంలో నీరు ఎక్కువగా ఉండటంతో పాటు పెద్దగా ఉండటంతో మృతదేహం ఎక్కడ ఉందనేది తెలియడం లేదన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



బండ్లగూడలో జలమయమైన రోడ్లు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో శనివారం ఉదయం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలైన మార్కండేయనగర్, బాబుల్‌రెడ్డి నగర్ రోడ్లపై మోకాళ్ల లోతు వరద నీరు చేరింది. నర్సాబాయి కుంటకు ఆనుకొని ఉన్న రోడ్లపై నీరు నిలిచి ఇళ్లల్లోకి నీరు చేరింది. ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. రోడ్లపై నీరు నిలువడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించి రోడ్లపై నిలిచిన వర్షపు నీరును ఓపెన్ డ్రైనేజీలోకి పంపించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు శుభ్రం చేశారు. దీంతో సాయంత్రం వరకు రోడ్లపై నిలిచిన వర్షపు నీరు ఇళ్లలోకి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వర్షం పడినప్పుడు రోడ్లపై ఉన్న ఓపెన్ డ్రైనేజీల్లో చెత్త వేయకుండా చూడాలని జీహెచ్ఎంసీ సిబ్బంది స్థానిక ప్రజలను కోరారు.

బండ్లగూడలో..

బండ్లగూడ: బండ్లగూడలో ఉరుములు, గాలులతో కూడిన వర్షం దాదాపు గంట పాటు ఎడతెరిపి లేకుండా కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారులు వరద నీటితో జలమయమయ్యాయి. రహదారులపై వరద నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. కొన్ని ప్రాంతాల్లో గోతుల్లో నీరు ఉండడంతో అవి చూసుకోలేక ద్విచక్ర వాహనాదారులు ప్రమాదాలకు గురయ్యారు.

గండిపేట మండల పరిధిలో..

మణికొండ: శనివారం ఉదయం గండిపేట మండల పరిధిలోని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. 45 నిముషాల పాటు వర్షం కురియటంతో రోడ్లపై వరద నీరు పారింది. అక్కడక్కడ లోతట్టు ప్రాంతాల్లో కొద్ది సేపు వర్షం నీరు నిలిచిపోయింది. అక్కడక్కడ చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లకు తగలటంతో అవి తెగి కింద పడ్డాయి. దీంతో రెండు గంటల పాటు విద్యుత్ సమస్య తలెత్తింది. మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.



చెరువుగా మారిన బాబుల్‌రెడ్డి నగర్ వీధి



